# నేడు కోరుట్లకు ఎమ్మెల్సీ కవిత

- భారత జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు రాక
- ఆరు చోట్ల బతుకమ్మను పేర్చనున్న కవిత
- మినీ స్టేడియంలో సంబురాల ఏర్పాట్లు


కోరుట్ల, అక్టోబర్ 20: కోరుట్ల పట్టణంలో శని వారం భారత జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించ నున్న బతుకమ్మ వేడుకల్లో భారత జాగృతి వ్యవ స్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొననున్నారు. ఈ సందర్భం గా ఉదయం 11 గంటలకు జగిత్యాలకు రానున్న కవిత, పట్టణంలోని ఇందిరా రోడ్డులో ఉన్న ప్రసాద్ సెలక్షన్స్ అధినేత బాలె నర్సయ్య, వైశ్య సంఘం వాసవి కల్యాణ భవనంలో, బీఆర్ఎస్ నాయకులు బొమ్మ రాజేశం, బెల్లాల ప్రశాంత్, సుజాత, పిన్నంశెట్టి ఆనంద్ ఇంట్లో బతుకమ్మను పేర్చే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు నంది చౌరస్తా నుంచి బతుకమ్మలతో శోభాయాత్రగా తరలివచ్చి ప్రభుత్వ జూనియర్ కళాశాల మినీ స్టేడియంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడనున్నారు. ఈ సందర్భంగా బతు కమ్మ ప్రాశస్త్యం, విశిష్టతతో పాటు, సాంస్కృతిక అంశాలపై ప్రసంగిస్తారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వ కుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వ కుంట్ల తెలిపారు. పట్టణంలోని మహిళలు, యువ తులు బతుకమ్మ సంబురాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. అలాగే పట్ట ణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదా నంలో ఏర్పాట్లను భారత జాగృతి జిల్లా, రాష్ట్ర నాయకులు పరిశీలించారు. బతుకమ్మ సంబు రాల్లో పాల్గొనే మహిళలకు ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# రాహుల్ రోడ్ షో అట్టర్ ప్లాప్

- అధికారంలో ఉన్నప్పుడు చక్కెర ఫ్యాక్టరీ గుర్తు రాలేదా..
- ఆనాడే పసుపునకు మద్దతు ధర ఎందుకు ప్రకటించలేదు
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 20: 'కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జగిత్యాలలో నిర్వహించిన రోడ్ షో అట్టర్ ప్లాప్‌గా నిలిచింది. అసలు ప్రజా స్పందనే లేదు. జనం లేక ఇరుకైన ప్రాంతంలో పెట్టి మమ అనిపించారు. కనీసం గ్రామాల నుంచి పట్టుమనీ పది మందైనా వచ్చారా..?' అని జగి త్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. రాహుల్ రోడ్ షో పేలవంగా సాగిందని, జగిత్యాల పట్టణ ప్రజలు కూడా హాజరవ్వలేదన్నారు. రోడ్‌షో లోనూ ఏదేదో మాట్లాడారని, రాజకీయ కుటుం బం నుంచి వచ్చిన వ్యక్తి ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి అభాసుపాలయ్యారన్నారు. మార్గమ ధ్యంలో నూకపల్లి వద్ద నిర్మించిన పేదోడి ఆత్మగౌ రవ ప్రతీక అయిన రెండు పడకల గదులను చూడాల్సి ఉంటే బాగుండేదన్నారు. నేనొక్కటే ప్రశ్నిస్తున్నానని, రాష్ట్రంలో 2004 నుంచి 2014 దాకా అధికారంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంది కదా..? మరి షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరిపిం చలేదో చెబితే బాగుండేదన్నారు. ఆనాడు పసుపు నకు సైతం మద్దతు ధర ఎందుకు ప్రకటించలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

# పూర్తైన మొదటి దశ ర్యాండమైజేషన్




కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీ గోపి

- కలెక్టర్ సమక్షంలో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- నేడు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు
- నిరంతర నిఘాలో స్ట్రాంగ్ రూమ్‌లు

కలెక్టరేట్, అక్టోబర్ 20: ఎన్నికల పోలింగ్ ప్రక్రి యను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్ని కల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ కేంద్రాల మొదటి దశ ర్యాండమైజేషన్‌ను శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. కలెక్ట రేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధి కారి డాక్టర్ బి.గోపి ఆధ్వర్యంలో ర్యాండమైజేషన్ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని 1,338 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన 2,674 బ్యాలెట్ యూనిట్లు, 2,089 కంట్రోల్ యూనిట్లు, 2,054 వీవీ ప్యాట్లను సిద్ధం చేశారు. కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 390, మానకొండూర్‌లో 316, హుజూరాబాద్‌లో 305, చొప్పదండిలో 327 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లోని అన్ని బూత్‌లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో కలెక్టరేట్ సమీపం లోని ఈవీఎంల గోదాంలను తెరిచి, అక్కడి నుంచే అందజేయనున్నారు. వీటిని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల కోసం ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాలకు తరలించనున్నారు. హుజూరాబాద్ సెగ్మెంట్‌లోని జూనియర్ కళాశాలలో, కరీంనగర్, చొప్పదండి సెగ్మెంట్లకు సంబంధించి నగరంలోని ఎస్సారార్ కళాశాలలో, మానకొండూర్ సెగ్మెంట్ కోసం నగర శివారులోని ఉజ్వల పార్కు సమీపం లో గల మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుచనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిరంతర నిఘాలో భాగంగా పటిష్టమైన భద్రత ఏర్పా ట్లు చేశారు. రెండో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలకుల సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి మాట్లాడారు. రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ సుబ్బారాయుడు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకి రణ్, ఇన్‌చార్జి డీఆర్వో పవన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు గాలి అనిల్‌కుమార్, నాంపల్లి శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, మోహన్, బర్కత్ అలీ, శ్రీనివాస్, ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది రాష్ట్రానికో మ్యానిఫెస్టో

- ఆ పార్టీ రంగులు మారుస్తూ రాజకీయం చేస్తున్నది
- రాహుల్ పర్యటనలో చెప్పినవన్నీ అబద్ధాలే
- కాళేశ్వరంపై అన్నీ కట్టుకథలే
- రాసి ఇచ్చిన స్క్రిప్టు చదివారే తప్ప వాస్తవాలు తెలుసుకోలేదు
- నగరంలో మీరు నడిచిన రహదారినిచూస్తే మా అభివృద్ధి ఏమిటో తెలుస్తుంది
- రాహుల్‌గాంధీపై మంత్రి గంగుల కమలాకర్ మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించారని, ఈ సందర్భంగా ఆయన చెప్పినవన్నీ అసత్యాలే అని మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధిపై ఏమాత్రం అవగాహన లేకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదివారే తప్ప అందులో ఏది వాస్తవం? ఏది అవాస్తవం? అన్నది చూడలేదన్నారు. కాళేశ్వరం పథకంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని గతంతో పాటు తాజాగా ఆరోపించారని, నిజానికి ఈ పథకం కోసం ₹80వేల కోట్లు ఖర్చు అయిందని గతంలో మా ప్రభుత్వం అనేకసార్లు వివరించి చెప్పిందన్నారు. ₹80 వేల కోట్లు ఖర్చయితే లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందో రాహుల్ గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని చెప్పడానికి ఇదో నిదర్శ నమన్నారు. అలాగే ప్రాజెక్టులకు భూములు గుంజుకున్నారే తప్ప నీళ్లివడం లేదంటూ మరో ఆరోపణ చేశారని, ఆయన ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల పాటుగా తిరిగింది అంతా కాళే శ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లొస్తున్న ప్రాంతమే అన్నారు. మంథని నుం చి ఆయన ప్రాజెక్టు వద్దకు వెళ్తే ఆ ప్రాజెక్టు ఎంత గొప్పదో తెలిసేదని, అలాగే ఆయన పర్యటించిన ప్రతి ప్రాంతంలో కాళేశ్వరం నీళ్లు వచ్చాయా రా లేదా అని రైతు లను అడిగితే తెలిసేదన్నారు. కానీ, ఇంత పచ్చి అబద్ధాలు చెప్పడం ధర్మమా..? అని ప్రశ్నిం చారు. కరీంనగర్‌మీ సేవా కార్యాలయంలో శుక్ర వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాహుల్‌గాంధీ ఆరోపణలపై తీవ్రంగా మండిపడ్డారు. ఆయన మాటల్లోనే..

### కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎంత రుణమాఫీ చేశారు?

ధరణి పోర్టల్‌తో రికార్డులన్నీ మార్చి నిరుపే దల భూములు కాజేశారంటూ మరో పచ్చి అబ్దం చెప్పారు. యాభై ఏండ్లకుపైగా ఈ దేశాన్ని పాలిం చిన కాంగ్రెస్, భూములకు సంబంధించిన ఒక్క రికార్డునైనా ఆధునీకరణ చేసిందా? అలా చేస్తే భూముల తగాదాలు ఎందుకు ఏర్పడ్డాయో చెప్పాలి. ధరణి అనేది ఒక బృహత్తర పథకం. రైతుకు పూర్తి హక్కులు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం. ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ అవుతున్న రైతులను అడిగితే తెలుస్తుంది. లక్ష రుపాయల రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. ఈ దేశంలో రెండు సార్లు రుణమాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అవునా కాదా..? చెప్పాలి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎంత రుణమాఫీ చేశారో చెప్పాలి. గత ఎన్నికల్లో కేంద్రం లక్షల రుణ మాఫీచేస్తామని చెప్పిన ప్రజలు కాంగ్రెస్‌నమ్మని విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. రైతుబంధు ద్వారా భూస్వాములు, ధనవంతులకే లాభం జరిగిందంటూ చెప్తున్న రాహుల్‌గాంధీ తెలుసుకో వాల్సిన విషయం ఏమిటంటే.. గుంట భూమి ఉన్న రైతుకు కూడా రైతుబంధు వస్తున్నది. ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని అత్యధిక కాలం పాలించింది కాంగ్రెస్ పార్టీయే కదా..? రైతుబంధు లాంటి పథకాన్ని ఎక్కడైనా ప్రవేశపెట్టారా..? పోనీ ప్రస్తుతం మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా..? చెప్పాలి. తెలంగాణలో కేవలం ఒక్క కుటుంబానికి మాత్రమే లబ్ధి జరి గిందని అవగాహన లేకుండా మాట్లాడారు. కానీ, ఇదో పచ్చి అబద్ధం. తెలంగాణలోని ఏ గడ పకు వెళ్లి అడిగినా.. ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు కనిపిస్తారు.

### కర్ణాటకలో ఐదు పథకాలు అడ్రస్ గల్లంతు

కర్ణాటక రాష్ట్రంలో ఈ యేడాది మేలో ఎన్ని కలు జరిగిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు హామీలు అమలు చేస్తా మని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ స్వయంగా హామీ ఇచ్చారు. కానీ, ఐదు నెలల్లోనే సదరు ఐదు హామీల్లో ఒక్కటైనా అమలుకు నోచుకుంటుందా చెప్పాలి. నాడు రోజుకు వ్యవ సాయ రంగానికి ఏడు గంటల కరెంటు ఇస్తామని చెప్పి రెండు గంటలు మాత్రమే ఇచ్చింది వాస్తవం కాదా..? బెంగళూరులో కరెంటు కోతలు పెరిగి ఐటీ కంపెనీలు షిఫ్టులు పెట్టుకునే దుస్థితి ఏర్పడింది నిజం కాదా..? అలాగే గృహ జ్యోతి పథకం కింద ప్రతి ఇంటికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించిన కన్నడ కాంగ్రెస్, ఇప్పుడు కరెంటు కోతలు పెడు తుంటే ఉచితం అవసరం లేదు మాకు కరెంటు బాగా ఇవ్వండి అంటూ ప్రజలు రోడ్డెక్కుతున్నది వాస్తవం కాదా..? అన్నభాగ్య స్కీం కింద 10 కిలోల బియ్యం ఇస్తామని, అధికారంలోకి రాగానే బియ్యం స్టాక్ లేదని, బహిరంగ మార్కెట్ ధర కట్టిస్తామని చెప్పి ఐదు నెలలు తిరగకుం డానే కేవలం రేషన్ దుకాణ ధర మాత్రమే కట్టి స్తామని మాటలు చెపుతున్నది వాస్తవం కాదా..? శక్తి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అని చెప్పి.. డీజిల్ బస్సులు నిలిపివేయడమే కాదు, ఇప్పుడు వయసుల వారీగా ఫ్రీ అంటూ కొత్త మెలిక పెట్టడం లేదా..? అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటిలో మహిళకు ₹2వే లువేస్తామని చెప్పి ఇప్పటివరకు హామీని నిలబె ట్టుకోలేదు కదా..? డీగ్రీ పాసైన యవతకు నెలకు ₹3వేలు, డిప్లొమా పాసైన వారికి ₹1500 భృతి చెల్లిస్తామని చెప్పినా నేటికి అమలు చేయకుండా ఐదు నెలల్లోనే పథకాలను అధోగతి చేసింది నిజం కాదా..? నేను చెప్పింది నిరూపించడానికి సిద్ధంగా ఉన్నా.

### ఒక్కో రాష్ట్రంలో ఒక్కో మ్యానిఫెస్టో

నిజానికి జాతీయ పార్టీ అంటే ఒకే విధానం ఉండాలి. కానీ, కాంగ్రెస్ మాత్రం రంగులు మారుస్తున్నది. తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరాం ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుంటే.. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోరకమైన మేనిఫెస్టో ప్రకటించి ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నది. తెలంగాణలో ₹4వేలు పింఛన్ ఇస్తామని, మిజోరాంలో ₹2,500 ఇస్తా మని చెబుతున్నది. తెలంగాణలో సిలిండర్ ₹500కు, మిజోరాంలో ₹750కి ఇస్తామని, ఇక్కడ ₹10 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పిస్తా మని, అదే మధ్యప్రదేశ్‌లో ₹25 లక్షలు ఇస్తా మని ప్రకటించింది. తెలంగాణలో మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు నెలకు ₹2500 ఇస్తా మని, అదే మధ్యప్రదేశ్‌లో మాత్రం ₹1500 ఇస్తామంటున్నది. ఎవరూ రాజకీయ రంగులు మారుస్తున్నారో వీటిని చూస్తేనే అర్థం అర్థమవు తున్నది.

### కాంగ్రెస్ వల్లే బలిదానాలు?

తెలంగాణ విముక్తి కోసం జరిగిన ఉద్యమాల్లో వందలది మంది బిడ్డల బలిదానాలకు కారణం కాంగ్రెస్ కాదా..? చెప్పాలి. 1956లో తెలంగా ణను ఆంధ్రాలో కలిపిందెవరు? 1969 జరిగిన ఉద్యమ సయంలో 369 మందిని బలితీసుకు న్నది కాంగ్రెస్సే. తెలంగాణ వెనుకబాటుకు కార ణమైంది కూడా ఆ పార్టీనే. కేసీఆర్ నాయక త్వంలో 2001నుంచి ఉద్యమం ప్రారంభిస్తే అనేక సార్లు ఆశ పెట్టి, వందల మంది బలిదానా లకు కారణమైంది. 2005 జనవరిలో ఆనాటి కేంద్ర మంత్రి ప్రణబ్‌ముఖర్జీ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ వేసి అమలు చేయకుండా కాల యాపన చేసింది నిజం కాదా..? 2009 నవం బర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్షకు దిగితే.. అరెస్టు చేసి ముప్పు తిప్పలు పెట్టింది కాంగ్రెస్ కాదా..? దీనిపై యావత్ తెలంగాణ గర్జిస్తే.. భయపడి 2009 డిసెంబర్ 9న ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తున్నామని ప్రకటించి మళ్లీ రెండు రోజు లకే మాట మార్చింది మీ పార్టీ కాదా..? దీని ద్వారా వందలాది మంది బిడ్డలు బలిగొన్నది మీరు కాదా..? నిజంగా ముందుగానే తెలంగాణ ఇచ్చి ఉంటే.. ఇన్ని బలిదానాలు జరిగేవా..? చెప్పాలి. తెలంగాణ వెనుకబాటు, బలిదానాలకు కారణమై ఇప్పుడు ఆ బలిదానాల్లో ఒకరైన శ్రీకాంత్ పేరు తలుచుకుంటూ.. మొసలి కన్నీరు కారిస్తే తెలంగాణ ప్రజలెవ్వరూ కాంగ్రెస్‌ను నమ్మరు.

● విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మేయర్ సునీల్‌రావు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, కరీంనగర్ మార్కెట్ చైర్మన్ రెడ్డవేణి మధు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.